



## “మా బావ యెప్పుడు మా యింటి కొచ్చినా రిక్షామీదో, ఆటోమీదో వస్తాడు తెలుసా!”

‘‘ఓస్ బడాయి మా బావ లక్ష రూపాయల ఖరీదు చేసే సిటీబస్సులో వస్తాడు తెలుసా!”





“ఈ వేళ పండగకదూ! మా బావ వస్తాడు. వెళ్ళిపోవాలి” అంటూ తుర్రుమంది బేబి తొక్కుడు బిళ్ళకి ఫుల్‌స్టాప్ పెట్టి.

గోపాలం ఆ యింటి కొత్త అల్లుడు. అతనికి అత్తారింటి కెళ్ళినపుడు చెయ్యాల్సిన పనుల్లో నిర్దిష్టంగా పాటించవల్సినవి కొన్ని వున్నాయి. ఇస్త్రీ మడత నలగకుండా వేసుకోవడం. తనకిచ్చిన రూంలోంచి సాధ్యమయినంత వరకు బయటకు రాకపోవడం. మామూలుగా అయితే ఒకటో రెండో సిగరెట్లు విడిగా కొనుక్కోవడం అలవాటుగాని అత్తారింట్లో మాత్రం ఫిల్టర్ సిగరెట్టు పెట్టి మెయిన్‌టెయిన్ చెయ్యడం. అందరి ముందు యెప్పుడూ పెర్రిమేసన్ నవల చదవడం (ఎవరూ చూడకపోతే చందమామ చదువుకుంటాడు చాటుగా).

సిటీ బస్సుమీద అత్తారింటి సెంటర్ వరకూ వచ్చి అక్కడ్నించి నడవకుండా పావలాకో, అర్ధరూపాయకో రిక్షాయో, ఆటోయో ఎక్కడం (అందరూ యింటి దగ్గరనుంచి డబ్బులకి మొహం చూసుకోకుండా ఆటోలోనో, రిక్షాలోనో వచ్చాడనుకోవాలన్న తాపత్రయం పాపం.)

ఈసారి పండక్కి అల్లుడొస్తాడని యింటిల్లిపాది యెదురుచూస్తున్నారు.

ఎదిరింటి రామయ్యగారి ఆవూ దూడా యింటికొచ్చేశాయి. పక్కింటి పిన్నిగారి కుక్క వూరంతా తిరిగి ఇంటికి చేరుకుంది.



పక్క వాటావాళ్ళ పనిపిల్ల కూడా వచ్చేసింది. కాని అల్లుడు యింకా రాలేదు. అలిగాడేమో అన్న భయం అత్తమామలకి వచ్చింది. అమ్మాయి కంట్లో గ్లిజరిన్ కూచిపూడి చేస్తున్నట్టుగా వుంది.

ఇంటి ముందర రిక్షాబెల్లు మోగింది..... ఇంట్లో వాళ్ళందరూ రోడ్డుమీద వెళ్ళే సినిమా ఎడ్వర్‌టైజ్‌మెంట్ బండిని చూడ్డానికి వచ్చిన పల్లెటూరి వాళ్ళలా, యాక్సిడెంటు అయితే చూడ్డానికివచ్చిన హడావిడి మనుషుల్లా బిలబిలా వచ్చారు. చాపా, చెంబూ పక్కనే పెట్టుకు కూర్చున్న చిన్నక్కయ్యను రాసుకుంటూ వెళ్ళింది బేబి.

“పట్టుకోండి....” “పట్టుకోండి” అంటూ పిక్‌పాకటర్‌ని పట్టుకునేదానిలా తరుముకొచ్చి, కాస్సేపు కాంపౌండులో కొక్కోక్కాడి, మొత్తానికి బేబికి వస్త్రాపహరణం చేసి, దేవిస్ కప్పు పట్టుకున్నంత ఫోజులో బేబి బట్టలు పట్టుకొని ఆనందపడి, దుశ్శాసనుని కజిన్ సిస్టర్‌లా లోపలకి ఠీవిగా నిష్క్రమించింది చిన్నక్క. రథంలోంచి గీతోపదేశం యివ్వడానికి క్రిందకి దిగిన కృష్ణపరమాత్మని వోలె దిగాడు గోపాలం రిక్షాలోంచి.

“యేమిటోయ్ యింత ఆలస్యం ?”

“లేదు మావయ్యగారు, రిక్షాలో నవల చదువుతూ యిమ్మర్స్ అయిపోయాను. రిక్షావాడు కాస్త కన్‌ఫ్యూజ్ అయి కాసేపు ‘మనోరమ’ బస్సులా కాలనీ అంతా తిప్పాడు.”

“బావా! బావా! అక్క నా బట్టలు” అంటూ వస్త్రాపహరణ అయిన గోపికాస్త్రీలా రెండు చేతులు రెండు కాళ్ళమధ్య అడ్డుపెటుకొంది బేబి.

గోపాలం పరిస్థితి అవాక్కయిపోయింది. మనస్సు లంఖణాన్ని శంకించింది. శరీరం తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చేసింది.

“మీ మరదలు చేసిన ఘనకార్యమండీ” అంటూ మూతి సున్నాలా పెట్టి నవ్వుతున్న భార్యామణి యిచ్చిన రిప్లైతో ఈ లోకంలో కొచ్చి పడి పత్యం తిన్నంత సంతోషపడ్డాడు.

“మరీ బయట నుంచుని ఏమిటే ఆ కబుర్లు అబ్బాయిని లోపలకి రానీయండి” అత్తగారి అదిలింపు.

“నాకు డబ్బులివ్వండి సార్” రిక్షా మనిషి కేకేశాడు.

“ఎక్కడ్నించి రాక, డైరెక్టుగా చిక్కడపల్లి నుంచేనా?”

“అవును. యింటి దగ్గరనుంచేనండి మావయ్యగారు. మరి మీ కాలనీకి డైరెక్టు బస్సు లేదుగా” అంటూ మామూలుగా

బస్‌సాపులోంచి మాట్లాడుకున్నట్టుగా పావలా రిక్షావాడి చేతిలో పెట్టాడు. కేసర్థమయింది రిక్షావాడికి.

"క్యా సాబ్" చిక్కడపల్లినుంచి వస్తే చారనా దేతేహై?"

"అసలెంతకి మాట్లాడేవోయ్?"

"ఏక్‌రుపయాచార్ అనాసాబ్"అంటూ గోపాలం చెప్పబోయేలోపున సైంధవుడిలా అడుపడ్డాడు రిక్షా మనిషి.

"రూపాయిపావలా అంటే నయమేనండి. మొన్న అత్తయ్యగారు చిక్కడపల్లినుంచి యిక్కడి కొచ్చినపుడు రెండు రూపాయలు తీసుకొన్నాడు.

"ఏడిశావ్....నువ్వు లోపలకి ఫో."

అంటూ పెళ్ళాన్ని కేకలేసి, అందరి ముందు బింకంగా రిక్షావాడికి రూపాయి పావలా యిచ్చేసి, సిగరెటు వెలిగించి, డబ్బుల విషయం పట్టించుకోనట్టుగా పెర్రీ మేసన్‌లో తోచిన పేజి వెర్రిగాతీసి కంటిన్యూగా చదువుతున్న వాడిలా మయసభలో దుర్యోధనుని ఫోజుతో గుమ్మాన్ని దాటబోయి మరదలి చెంబు తన్నబోయి తమాయించుకొని తాగినవాడిలా తూలుతూ లోపలకు వెళ్ళాడు ఫోజుగా గోపాలం.

బస్‌సాపులోంచి పావలాకి కుదిరిన బేరందగ్గర రూపాయిపావలా కొట్టినందుకు యమ 'ఫోజు' ఫీలయ్యాడు రిక్షావాడు.

---




జబల్‌పూర్ రైల్వేస్టేషన్‌లో గంగా-కావేరి ఎక్స్‌ప్రెస్ ఉదయం పదిన్నరకు వచ్చి ఆగింది.

సూట్‌కేస్ తీసుకుని మెల్లగా దిగాడు సురేష్.

చుట్టూ కలయచూశాడు. అంతా హిందీ మాటలే విన్పిస్తున్నాయి. మచ్చుకైనా తెలుగు మాట విన్పించడం లేదు. మధు కోసం కొంతసేపు అటూయిటూచూశాడు. కానీ అతనికి మధు కన్పించలేదు. సురేష్‌కు కొంచెం భయం వేసింది. ఆంధ్రను వదలి అంత దూరం వెళ్ళడం తనకదే మొదటిసారి. హిందీ తనకు ఓ ముక్క కూడా రాదు. ఓ వేళ మధు యిక్కడికి రాకపోతే తనేమిటి చేయడం? సరాసరి అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాలి. ఆ కొత్త ప్రదేశంలో భాష తెలియని ప్రాంతంలో తను ఎలా మధు అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళడం?

"హలో"– అంటూ ఎవరో భుజం మీద చేయి వేశారు.

ఉలిక్కిపడి తిరిగి చూశాడు సురేష్.

"మీరు సురేష్ అనుకొంటాను—" న్నాడు మధు.

"అవునండీ మీరు మధుబాబు కదూ?"

"యస్. రండిబయటకి వెళ్దాం."

రైలు ఎక్కే దిగే వాళ్ళతో స్టేషన్ ాలా రద్దీగా ఉంది. యిద్దరూ స్టేషన్ బయటికొచ్చారు.

"మీ సిస్టర్ శిరీష బాగుందా?" అడిగాడు మధు.

"బాగుందండి. మిమ్మల్ని మరీ మరీ అడిగినట్లు చెప్పమంది."

"ఆవిడను కూడా తీసుకు రాలేకపోయారా?"

"ఇంత దూరం పంపడానికి యింట్లో ఒప్పుకోరండి. అన్నట్టు మీకోసం స్పెషల్‌గా స్వీట్సుచేసి నా దగ్గర యిచ్చి పంపింది"– చెప్పాడు సురేష్.

ఇద్దరూ టాంగాలో ఎక్కి కూర్చున్నారు. టాంగా స్పీడుగా వెళుతోంది. సురేష్ కూర్చునే చుట్టూ చూస్తున్నాడు. పదకొండు గంటలవుతున్నా యింకా చలిగానే వుంది. మధుబాబుకు చాలా ఆనందంగా వుంది. తన కోసం శిరీష ప్రత్యేకంగా స్వీట్లు చేసి పంపింది. దీనిని బట్టి తనంటే శిరీషకు చాలా యిష్టమనే విషయం తేటతెల్లమైపోతోంది. ఇప్పుడు తను వాళ్ళన్నయ్య సురేష్‌ను బాగా అతిధిగా సత్కరిస్తే సురేష్ అభిమానాన్ని కూడా చూరగొనవచ్చు. తిరిగి తిరుపతి వెళ్ళాక తనను ఎలాట్రీట్ చేసింది శిరీషతో చెప్పకపోడు.

టాంగా యింటి ముందాగడంతో యిద్దరూ దిగేశారు.

ఆరాత్రి వరకు హాయిగా కబుర్లు చెప్పుకొన్నారు. ఇంట్లో వాళ్ళందరికీ మధు సురేష్‌ను పరిచయం చేశాడు. మధు

వెలువడుతోంది!
చాలా కాలము నుండి మీరు ఎదురు చూస్తున్న - హాస్యరసభరితమైన
మొక్కపాటివారి బారిష్టరు పార్వతీశం
అందమైన బాపు బొమ్మలతో
ప్రచురిస్తున్నాము
మీకు కావలసిన కాపీలకు
ముందుగా రిజర్వు చేసుకోండి.
న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్
విజయవాడ-520002.